క్లుప్తంగా

ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలి

తెలంగాణ ఉద్యమకారుల సంఘం

యాచారం: ఎన్నికల్లో ప్రచారంలో కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యాచారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రామకృష్ణకు అందజేశారు. ఉద్యమకారులకు ఇంటి స్థలం, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు చిక్కుడు గుండాలు, విష్ణువర్ధన్, యాదిరెడ్డి, శ్యామల, కిషన్, రాములు, యాదయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ హరితగౌడ్



మొక్కలు పంపిణీ చేస్తున్న హరితగౌడ్

తుర్కయంజాల్: మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరితగౌడ్ అన్నారు. బుధవారం ఆమె వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని ఇంజాపూర్‌లో 24వ వార్డులో మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం మిథాని కాలనీలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాలనీ గౌరవ అధ్యక్షుడు శంకర్ గౌడ్, నాయకులు దేవేందర్, పాపయ్య, శ్రీనివాస్ గౌడ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు చరిత్రాత్మకం

టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య

కడ్తాల్: డీఎస్సీ–2003 ఉపాధ్యాయులు పాత పెన్షన్ విధానానికి అర్హులేనని హైకోర్టు తీర్పునివ్వడం చారిత్రాత్మకమని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2004 సెప్టెంబర్ 01 ముందే ఉద్యోగ నోటిఫికేషన్ వచ్చిందని, పాత పెన్షన్ విధానానికి అర్హులమని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించారు. సీపీఎస్‌కు ముందే నోటిఫికేషన్ వచ్చిందని టీఎస్ యూటీఎఫ్ సంఘం అనేక రకాల పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. 2003 ఉపాధ్యాయులకే కాకుండా, మొత్తం 2004 సెప్టెంబర్ 01 ఉపాధ్యాయులుగా నియామకమయ్యారో వారికి సైతం ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి

లయన్స్‌క్లబ్ ఆమనగల్లు ఉపాధ్యక్షుడు రాము



ఎంబ్రాయిడరీ వర్క్ షాప్‌ను ప్రారంభిస్తున్న రాము

ఆమనగల్లు: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము సూచించారు. బుధవారం ఆయన పట్టణానికి చెందిన పద్మ ఏర్పాటు చేసుకున్న ఎంబ్రాయిడరీ వర్క్ షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణిస్తూ మరో పది మందికి ఉపాధి చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యాదమ్మ, నాయకులు భాస్కర్, శ్రీశైలంయాదవ్, శ్రీను, శ్రీను నాయక్, తారాసింగ్‌నాయక్, భూపతిరెడ్డి, రమేశ్, ఆనంద్, గోపి, పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ



రేషన్‌కార్డులు అందజేస్తున్న సయ్యద్‌పాషా తదితరులు

కడ్తాల్: అర్హులందరికీ ప్రభుత్వం రేషన్‌కార్డులు అందజేస్తుందని ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములుగౌడ్ అన్నారు. బుధవారం ఆయన పంచాయతీ కార్యదర్శి సయ్యద్‌పాషాతో కలిసి లబ్ధిదారులకు మంజూరైన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, జంగయ్య, అంజయ్య, రాములుగౌడ్, చంద్రయ్య, మహేందర్‌గౌడ్, యాదయ్య, హరిచంద్ర, అరవింద్, మహేశ్, డీలర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల దరువు.. పట్టించుకునే వారు కరువు

- ఇబ్బంది పడుతున్న మంచాల మండల కేంద్రవాసులు
- పలుమార్లు వినతులిచ్చినా పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మంచాల: పంచాయతీ పాలన వ్యవస్థ గాడితప్పింది. ప్రజల తాగు నీటి కష్టాలను తీర్చేవారు కూడా కరువయ్యారు. మండల కేంద్రంగా ఉన్న మంచాల గ్రామంలో 5,600 మంది జనాభా 3,922 మంది ఓటర్లు ఉన్నారు. మండల కేంద్రంలో ఏ చిన్న సమస్య వచ్చినా సత్వరమే పరిష్కారమవుతాయని ఆశించిన గ్రామస్తులను పట్టించుకునే వారే లేక ఇబ్బంది పడుతున్నారు.

చీకట్లో మగ్గుతున్న గ్రామం

గ్రామంలో వీధి దీపాలు లేక ఇబ్బంది పడుతున్నారు. 520 వీధి దీపాలుండగా వీటిలో సగానికి పైగా పాడయ్యాయి. నాలుగు నెలలుగా వెలగకున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షాలకు పాములు, తేళ్లు తదితర విషసర్పాలు సంచరిస్తున్నాయని అధికారులు



వెలగని వీధి దీపం

స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

తాగునీటికి తిప్పలు

గ్రామంలో కొన్ని రోజులుగా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మిషన్ భగీరథ నీళ్లు వచ్చినా వాటిని సరఫరా చేయడంలో వైఫల్యం చెందారు. ఇదే విషయమై ఎంపీడీఓ బాల శంకర్ వివరణ కోరగా తమ దృష్టికి రాలేదు. వెంటనే పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని బదులిచ్చారు.

ఇబ్బంది పడుతున్నాం



సమస్యలను అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. వీధి దీపాలు లేక ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయించాలి.

– మొగిలి మహేశ్

సమస్యలు పరిష్కరించాలి



గ్రామ సమస్యలను ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. చూస్తామంటున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదు. తాగునీటికి నానా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు పర్యటించి శాఖల వారీగా సమస్యలు పరిష్కరించాలి.

– ఎ. బాలరాజ్

అర్హులందరికీ రేషన్ కార్డులు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం: అర్హులందరికీ రేషన్‌కార్డులను అందజేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల మున్సిపాలిటీలు, మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో ఇప్పటి వరకు మంజూరైన కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలకులు పేదలను విస్మరించారని.. వారి పదేళ్ల పాలనలో ఓ ఒక్క పేదవాడికి రేషన్‌కార్డును, ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. దశల వారీగా పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు గురునాథ్‌రెడ్డి, చిలుక మధుసూధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్, తహసీల్దార్ సునీత, మున్సిపల్ కమిషనర్లు సత్యనారాయణరెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలోని రాగన్నగూడ బృందావనం కాలనీ వాసులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. యూజీడీ, తాగునీటి పైప్‌లైన్, సీసీ రోడ్లు, వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని కాలనీ వాసులు తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డికి ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సామ భీంరెడ్డి, కాలనీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కోశాధికారి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

కడ్తాల్: స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మహేంద్ర కుమార్‌రెడ్డి అన్నారు. లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఇమీడియట్ పాస్ట్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో బుధవారం వీల్స్ ఆన్ మీల్స్ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవ కార్యక్రమాలను అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవ కార్యక్రమాలను చేపట్టాలని, సేవలతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ చెన్నకిషన్ రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌గుప్తా, తాళ్ల అంజయ్య, లింగయ్య, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహ, రాంరెడ్డి, లక్ష్మయ్య, జహంగీర్‌అలీ, చేగూరి వెంకటేశ్, రమేశ్, రాజేందర్‌యాదవ్, రాజు, జంగయ్య, పీఆర్వో పాషా తదితరులు ఉన్నారు.



అన్నదాన కార్యక్రమంలో డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు: పట్టణంలో మాడ్గుల రోడ్డులో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. పట్టణంలోని రాజీవ్ చౌరస్తా నుంచి గాంధీ విగ్రహం నుంచి మాడ్గుల రోడ్డులో సందబావి వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చాలా ఇళ్లు ముందు భాగంలో కూల్చివేశారు. ప్రస్తుతం సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. అనంతరం రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక నాయకులు దుర్గయ్య, మెకానిక్ బాబా, రవీందర్, విజయ్‌రాథోడ్, ఎస్ఐ వెంకటేశ్ తదితరులు ఉన్నారు. అంతకుముందు ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము లక్ష్మమ్మ ఇటీవల మృతిచెందడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి మాజీ సర్పంచ్ సత్యం, స్థానిక నాయకులు వెంకటయ్య, సాయిలు గౌడ్, రాకేశ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.



మాడ్గుల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

పేదల సంక్షేమానికే పథకాలు

మాడ్గుల: పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పనిచేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ రేషన్ కార్డు, సొంతిళ్లు ఇవ్వలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కొక్కటిగా హామీల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ కిషన్ రెడ్డి, నాయకులు కొండల్ రెడ్డి, పాండు గౌడ్, జగన్, రాములు, జంగయ్య, యాదయ్య, సాయిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, దళపతి గౌడ్, బాబా, సలీం, అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని గానుగుమార్లతండా పంచాయతీ పరిధిలోని పోచమ్మ గడ్డతండాకు చెందిన జర్పుల ప్రియాంకకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 27 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఈ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్పతినాయక్, నాయకులు జగన్‌గౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో ప్రతిపక్షాలకు స్థానం లేదు



లబ్ధిదారులకు రేషన్‌కార్డు ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ప్రజాప్రతినిధులు

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- మండలంలో పలు భవనాల ప్రారంభం, రేషన్‌కార్డుల పంపిణీ

కేశంపేట: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రతిపక్షాలకు స్థానం లేకుండా పోయిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని వేములనర్వలో అంగన్‌వాడీ భవనం, పుట్టోనిగూడలో జీపీ భవనం, అల్వాలలో మహిళా సంఘం భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా అల్వాలలో 24 గంటల విద్యుత్ సరఫరా కోసం నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్, కొత్తపేటలో ముదిరాజ్ భవనం, సుందరపురంలో జీపీ భవనాలను ప్రారంభించారు. కేశంపేటలో యెన్నం సుమిత్రమ్మ జ్ఞాపకార్థం ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన 2,200ల నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని.. అందులో భాగంగానే గ్రామాల్లో రేషన్ కార్డులను అందిస్తోందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్క రేషన్‌కార్డు కూడా అందించలేకపోయిందని విమర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజాంఅలీ, విద్యుత్ ఏఈ ఈశ్వర్, పార్టీ మండల అధ్యక్షులు గూడ వీరేశ్, జగదీశ్వర్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాలశ్రావణ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

బీజేపీ గిరిజన మోర్చా షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మోహన్‌సింగ్

షాద్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ గిరిజన మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జి మోహన్‌సింగ్ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ, చింతగూడ గ్రామాల్లో పార్టీ నూతన బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. తద్వారా పార్టీ గ్రామ స్థాయిలో బలోపేతం అవుతుందన్నారు. ఈ సందర్భంగా కాశిరెడ్డి గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడిగా తోట సాయికుమార్, కార్యదర్శిగా శివ, మన్‌కీ బాత్ ప్రముఖ్‌గా సాయికుమార్, చింతగూడ గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడిగా రాజు, కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి, మన్‌కీబాత్ ప్రముఖ్‌గా కిరణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు నాయకులు నూతన సభ్యులకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, చేగు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

త్వరలో ఉపాధ్యాయుల పదోన్నతులు

పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

మొయినాబాద్: రాష్ట్రంలో త్వరలో ఉపాధ్యాయుల పదోన్నతలు జరగబోతున్నాయని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వల్లూరి అంజనేయులు ఉద్యోగ విరమణ సభ బుధవారం ఠాకూర్ విజయ గార్డెన్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ఆంజనేయులు దంపతులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తిలో 37 సంవత్సరాల అంకిత భావంతో పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తున్న ఆంజనేయులుకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, జీహెచ్‌ఎంఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్‌గౌడ్, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్, ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోచయ్య, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘువేందర్, ఎంఈఓ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న అనురాధకిషన్‌రెడ్డి దంపతులు

మాడ్గుల: దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని మాజీ సర్పంచ్ అనురాధకిషన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాజీవ్‌నగర్ తండా తుల్జాభవాని మాత ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ.. రూ.6 లక్షలు వెచ్చించి ఆలయ నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, తండావాసులు అనురాధ కిషన్‌రెడ్డి దంపతులను సన్మానించారు.

ఎరువులు పంపిణీ చేయాలి

ఆమనగల్లు: రైతులకు అవసరమైన ఎరువులను గట్టుప్పలపల్లి పీఏసీఎస్ గోదాం వద్ద అందుబాటులో ఉంచాలని గౌడ సంఘం కల్వకుర్తి తాలూకా కన్వీనర్ అశోక్‌గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. గతంలో గోదాం వద్ద సింగిల్ విండో ఆధ్వర్యంలో అవసరమైన ఎరువులు అందించారని గుర్తు చేశారు. ప్రస్తుతం సరఫరా చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

సినారె జీవితం ఆదర్శం

హయత్‌నగర్: జ్ఞానపీఠ పురస్కార గ్రహీత కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి వ్యక్తిత్వం మహోన్నత హిమగిరి శిఖరమని.. ఆయనలోని నిరంతర పఠనాభిలాష విద్యార్థులకు ఆదర్శప్రాయమని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు అన్నారు. సినారె జయంతిని సందర్భంగా తెలుగు విభాగం అధ్యక్షుడు నరసింహ ఆధ్వర్యంలో బుధవారం సినారె జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఎంతో మంది సమకాలీన కవులను ప్రభావితం చేసిన నారాయణరెడ్డి తెలుగు సాహిత్యంలో ఉన్నత స్థాయికి ఎదిగారని.. ఆయన కలం నుంచి జాలువారిన పాటలు ఎన్నో ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇందిర, అధ్యాపకులు వెంకటలక్ష్మి, శశిధర్, మల్లేశ్, యాదయ్య, రమాదేవి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

వనస్థలిపురం: విద్యార్థుల చదువుకోసం వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలు కొనియాడదగినవని ఆదిత్య ఐటీ కాన్సెప్ట్ పాఠశాల చైర్మన్ సుధాకర్ అన్నారు. వాసవి వనిత ప్రశాంత్‌నగర్ క్లబ్ ఆధ్వర్యంలో సుదర్శన్ దంపతులు ఆదిత్య కాన్సెప్ట్ పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులకు రూ. 1.20లక్షలు పాఠశాల యాజమాన్యానికి అందజేశారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

ఎల్బీనగర్: కాలనీ అభివృద్ధే తన ధ్యేయం అని, కాలనీలో మౌళిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కాలనీలో ఓపెన్ జిమ్ మంజూరు, పార్కు ఏర్పాటు, సాయిబాబా గుడి నుంచి శివాలయం వరక సీసీ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేసిన సందర్భంగా కాలనీ అధ్యక్షులు పోగుల రాంబాబు అధ్వర్యంలో బుధవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వైదేహినగర కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనిల్‌కుమార్‌చౌదరి, లక్కరాజు ప్రశాంత్ ముద్దగౌని సుమన్‌గౌడ్, సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ ప్రారంభం

ప్రతి కాలనీలో కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ కాలనీలో కమ్యూనిటీహాల్ బుధవారం కార్పొరేటర్ లచ్చిరెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్స్‌ను ఏర్పాటు చేయడంతో కాలనీ సమస్యలను చర్చించుకునే అవకాశం ఉందని దీంతో కాలనీలో అభివృద్ధి పనులను శరవేగంగా చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జలందర్‌రెడ్డి, నాయకులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, సుధాకర్‌యాదవ్ అనిల్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న స్థానికులు

పీవీఆర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

శంకర్‌పల్లి: పట్టణంలోని పీవీఆర్ కన్‌స్ట్రక్షన్ నిర్మిస్తున్న భవనం 5వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడి సంతోష్ అనే వ్యక్తి మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే బుధవారం సీఐటీయూ నాయకులు ఘటనా స్థలానికి చేరుకొని, పరిశీలించి, కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ.. యాజమాన్య నిర్లక్ష్య వైఖరితోనే కార్మికుడు మృతి చెందాడని, వారి కుటుంబానికి రూ.50లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మిక శాఖ అధికారులు నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించి, యాజమాన్యాలు కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలను గూర్చి తనిఖీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, శ్రీనివాస్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

షాద్‌నగర్: బంజారా భవన నిర్మాణానికి గత ప్రభుత్వం కేటాయించిన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, ఆ స్థలాన్ని కాపాడాలని కోరుతూ బుధవారం గిరిజన సంఘాల నాయకులు ఫరూఖ్‌నగర్ డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని గుండ్లకుంట గ్రామ శివారులో గత ప్రభుత్వం బంజారా భవన నిర్మాణానికి ఎకరా భూమిని కేటాయించిందని పేర్కొన్నారు. అదేవిధంగా భవన నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలతో అంచనా వ్యయాన్ని తయారు చేసినట్లు తెలిపారు. కానీ గుర్తుతెలియని కొందరు వ్యక్తులు భవనానికి కేటాయించిన భూమిని కబ్జా చేశారని, అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడి హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు మంగులాల్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ గిరిజన ఆదివాసీ సంఘం జిల్లా చైర్మన్ శ్రీనునాయక్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌నాయక్ ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు